# ఎవరికి?

కాలుస్తున్న ఫారెన్ సిగరెట్‌ను యాష్‌ట్రేలో కుక్కి టైం చూసుకున్నాడు 'విశ్వంగారు' అనబడే విశ్వం— ఇంకా పావుగంట వుంది అనుకున్నాడు, తన లోనే— 'పావుగంటే' విసుక్కున్నాడు కూడా— అతను టైమంటే పడిచచ్చే మనిషి. టైం ప్రకారం లేస్తాడు, టైం ప్రకారం అన్నీ చేసేందుకు టైంకొచ్చే ఓ నౌకరూ, ఓ వంటమనిషీ కూడా వున్నారతనియింట్లో, స్వంతార్జనతో కొనుక్కున్న ఓ మేడ, ఓ పుష్పకం లాంటి కారు వున్నాయతనికి.

ఆరడుగుల భారీవిగ్రహం అతనిది. పల్చని పట్టులాల్చీవేసి పంచికడితే జమిందార్లా వుంటాడు. పడకగదిలో తప్ప అతని వంటిమీద చొక్కా, అతని కాళ్ళకి మెత్తని చెప్పులూ ఎప్పుడూ వుంటాయ. 'బాబుగారీ పని చెయ్యాలి' అని ఎవరైనా తనవాళ్ళు అతని దగ్గరకొస్తే కాదుపొమ్మని ఎప్పుడూ అనడతడు. శతృవును కూడ చిరునవ్వుతో పల్కరించి ఎవరికేది చెయ్యాలో అది చేసే సామర్థ్యముందతనికి.

బంగారపు రిమ్‌లెస్ కళ్ళద్దాలు తీసి కళ్ళొత్తుకున్న అవసరం అతని కెప్పుడూ రాలేదు— అతనికి కళ్ళద్దాలు నలభైయ్యో యేట, కొడుక్కి నూనూగు మీసాలొచ్చేటప్పుడొచ్చాయి. మీసాలు కొడుకుని పెద్దవాణ్ణి చేసినట్టే కళ్ళద్దాలు విశ్వానికి గాంభీర్యాన్ని తెచ్చిపెట్టాయి. 'ఖద్దరు బట్టలేసుకుని టోపీ పెట్టుకుంటే అచ్చం మంత్రిలా వుంటారు' అంటారంతా అతని ముందు. అప్పుడనుకుంటా డతను.—తనెందుకు రాజకీయాల్లోకి దిగలేదా అని!

విశ్వం మామగారో రాజకీయవాది. దేశనాయకుల వెనకాల తిరిగి

వాళ్ళ వెనక జైళ్ళకెళ్ళి ఆ డిగ్రీతోనే స్వాతంత్ర్యమొచ్చాక కాస్త డబ్బు పోగు చేసుకున్నాడు మామగారిపల్ల తనకు సంక్రమించిన ఆస్తంతా పాతికెకరాల పొలం, రెండంతస్థుల ఓ మేడ పాతకాలపు భార్య—

భార్య అతనికి పాతకాలందానిలా కన్పిస్తున్న దిప్పుడిప్పుడే.

పదిమంది పెద్దాఫీసర్లతోనూ, వాళ్ళ వాళ్ళ భార్యలతోనూ పిక్నిక్కుల పేర మజా చేసినపుడూ, నలుగురితోపాటు నారాయణా అంటూ అంతస్థుల ఎయిర్ కండిషండ్ హోటల్లో కేబరా చూసినమైకంలో యింటికొచ్చినపుడూ, ఇటువంటి ఏ ఎంగేజిమెంట్లూ లేకపోయిన రోజున దంతపు భరిణిలాంటి పడ గ్గదిలో ఫోం బెడ్డుమేద పడుకుని యే ఇంగ్లీషు సెక్సునవలో చదువుకుంటున్న సమయంలో శృంగారం తెలియని భార్య మాట్లాడినపుడు అతనికి భార్యంటె విసుగొస్తుంది.

అందం వయసు లేకపోయినా, సరసం. శృంగారం తెలయని మొద్దు అనుకుంటాడతను అందుకే రాత్రివెలుగులో తప్ప భార్యని చూడ్డానికిష్టపడ డతడు.

విశ్వం ఆ వూళ్ళో ఓ పెద్ద బిజినెస్ మాగ్నెట్. పెద్ద పెద్ధ వాళ్ళని చెప్పుకునే వాళ్ళంతా ఆతని చుట్టూ తిరుగుతుంటారు ఆ వూళ్ళో చాలా కంపెనీల్లో (అతని పేర్న కాకపోయినా) షేర్లున్నాయి. ఒకడికి వుద్యోగం వేయించాలన్నా. మరో వూరు ట్రాన్సఫర్ చేయించాలన్న. చివరికి వురి తీయించాలన్నా కూడా కావల్సినంత పలుకుబడి వుంది. ఉద్యోగం తీయించాలన్నా ఎవరికయినా 'లేద'ని చెప్ప కుండా 'చూదాం' అని చెప్పగలిగే చాకచక్యముంది. తన కోసం, తన వాళ్ళ కోసం యేపనైనా చేయగలిగే ధైర్యముంది, అతడు రెండుకంటె ఎక్కువ చేతులతో ఆర్జించగలడు. రెండు కంటె ఎక్కువ కళ్ళతో లోకాన్ని చూడగలడు. ఆ వూరికి కొత్తగా వచ్చి మొన్న మొన్నటిదాకా ఎదురు తిరిగిన కుర్ర ఎంప్లాయిమెంటు ఆఫీసరుకూడ యిప్పుడు విశ్వానికి దాసుడు.

ఆశుభ సమయములోనే యిప్పుడీవిందు ఏర్పాటు చేశాడు విశ్వం. సరిగ్గా ఆరుగంటలకి ఎంప్లాయిమెంటాఫీసరు, జగతి కంపెనీ మేనేజరు భుజంగంరావాల్సి వుంది.

విశ్వం మరోసారి టైం చూసుకున్నాడు. ఆటోమేటిక్ రోలెక్స్ వాచ్ యింకా అయిదు నిమిషాలుందని చెప్పింది.

లేచి, గాజు తలుపులు తీసుకుని బయటకు వెళ్ళి పేరపిట్ వాల్‌కి ఆనుకుని నిలబడ్డాడు. కొండమీంచి వచ్చే చల్లగాలికి యింటిముందున్న పూలతోట మత్తుగా మందుకొట్టినవాడిలా వూగుతోంది. ఎదురుగా నాలుగు బంగళాల వతల కొండదిగువకు కూలీలు వేసుకున్న పాకలు, దేవతలు తిని పారేసిన పకోడి పొట్లాల్లా వున్నాయి.

సరిగ్గా ఆరయ్యేసరికి గండభేరుండం లాంటి కారు విశ్వం యింటి ముందు నిలిచింది. మరో అరగంటలోనే విందు ప్రారంభమైంది.

* * *

వీధరుగు మీద కూర్చుని విజయ్ ఆలోచిస్తున్నాడు. ఆ అరుగు తాలూకా యిల్లు విజయ్‌దికాదు... ఆ యింటి యజమానికి యీ యింటితో కలిపి నాలుగిళ్ళున్నాయి... ఒక్కొక్క యింట్లోను ఐదేసి వాటాలకు తక్కువగాకుండా. ఒక్కొక్క వాటాకి యేభై రూపాయలకు తక్కువగాకుండా అద్దెకిచ్చే ఔదార్యముంది. అద్దివ్వని వాళ్ళని మెడబట్టి గెంటేధైర్యం, రెండునెలలకోసారి అద్దెపెంచే హక్కూవున్నాయి. ఆ యింటిని సూర్యుడూ చంద్రుడూ కాపలా కాస్తుంటారు.

"నాకేముంది బతకడానికి?" అనుకుంటాడు విజయ్ అప్పుడప్పుడు. అతనింట్లో ఆనందంలేదు, ఐశ్వర్యంలేదు. రేషన్ కార్డుకన్నా విలువుంది కాని అతని దగ్గరున్న డిగ్రీకి విలువలేదు, అతనికి నెల నెలా జీతం అందుకోని బడిపంతుల్లాంటి తండ్రియినా లేడు డబ్బులేదు... వుద్యోగంలేదు. ఉద్యోగంతో

సహా లక్షలాస్తితో పిల్లనివ్వగలిగే మామగారు లేరు,

హిందీ రామాయణంలోని శబరిలాంటి ఓ తల్లీ, పరికిణీలు బొప్పుండవూ చీరలు కొనూ అని అల్లరిపెట్టే అమాయకపు చెల్లెలూ వున్నారు. ఇంకా... డబ్బుండి అక్కరకురాని బంధువులూ, డిగ్రీవుండీ చేతికందిరాని వుద్యోగాలు ఎన్నోవున్నాయి.

ఆ సమయంలో రామదూతలా వచ్చి బరువైన ఓ కవరును విజయ్ చేతిలో పడేసి అతని ముఖంలోని ఫీలింగ్స్‌ను చూడకుండానే గోడకు కొట్టిన బంతిలా వెళ్ళిపోయాడు పోస్ట్‌మన్.

విజయ్ యిప్పుడెదురు చూసేది ఆ కవరుకోసమే. రిగ్రెట్సో యింట ర్వ్యూకి రమ్మనో, యే దేముణ్ణీ తల్చుకోకుండానే చరిచిన చింపాడు. అతని కళ్ళు నశించిపోతున్న ఆశల్లాకాకుండా దేవుడిముందు వెలిగించిన దీపాల్లా వెలిగిపోయాయి.

ఆ కవరులోని సారాంశం అతని తల్లితో చెప్పటానికాట్టేసేపు పట్టలేదు. బాధనైనా మింగగలదుగాని భూదేవి సంతోషాన్ని పట్టలేదు. విజయ్ తల్లి పేరు భూదేవి. సహనానికి నిజంగా ఆమెభూదేవే? కొడుక్కి వుద్యోగం వస్తుందన్న సంతోషం, రావాలనే ఆశ, ఆమె మనసును బంగారుఉయ్యాల్లో పెట్టి వూయిం చాయి. పట్టభద్రుడైనా కొడుక్కి ఇన్నాళ్ళూ ఎందుకు వుద్యోగం రాలేదో ఐన్‌స్టీన్ సిద్ధాంతంలా అర్థంకాలేదామెకు— ఒక్కొప్పుడు ప్రాప్తిలేదను కుంటుంది, మరోప్పుడు ఆ భగవంతుడి కృప యింకా తనపై ప్రసరించలేదని సరిపుచ్చు కుంటుంది అందుకె ఆ యింట్లో యేమున్నా లేకపోయినా తెల్లారేసర్కి దేముడి ముందు దీపాలుంటాయి!

మెరుపుమెరవగానే ఆనందపడేవాడు కాదు విజయ్ యేపిడుగు ఎక్కడ పడుతుందోనన్న భయంతో ఆలోచించగలడతను.

ఇన్నాళ్ళకైనా ఇంటర్వ్యూకి పిలుపొచ్చిందన్న సంతోషం వరద ప్రవా

హంలోనీటి బుడగలా అతనిలో అట్టేసేపు నిలవలేదు. ఎన్నాళ్ళో కలలుగని కొనిపించుకున్న కొత్తబంతి చెయ్యిజారి మురుగు కాల్వలోకి పోయే సమయంలో పరుగెత్తే కుర్రవాడి ఆతృత యిప్పుడు విజయ్‌లో కన్పిస్తోంది. ఇంటర్వ్యూకి ఎలా వెళ్ళాలనేదే ఆలోచన —

ఎలా లేదన్నా యాభై రూపాయలు కావాలిప్పుడతనికి.

విజయ్‌కేమీ పాలుపోటంలేదు. అతని చేతిలో చిల్లిగవ్వలేదు అమ్ము కుందికన్నా యింట్లో విలువైన వస్తువులేదు. ఆ రాత్రి విజయ్‌కి నిద్రపట్టలేదు అప్పటికే ఆతను అడగాల్సిన వాళ్ళందరినీ అడిగి లేదనిపించుకున్నాడు. నిజమే యేం చూసి యిస్తారుతనకు ... ఉద్యోగమా? ఆస్థా? పలుకుబడా?

అంచేత ఆతను 'నేనెందుకు బతకాలి?' అని తనపై అసహ్యాన్ని పెంచుకోడం తప్పేంకాదు — మనిషికి కావల్సినవేవీ అతనికి లేవు — కనీసావసరాలను తీర్చుకునేందుకన్నా అవకాశంలేదు — వచ్చే ఒకటి రెండు అవకాశాలున్నా విజయ్ స్థితిని అంతదూరం లోంచే చూసి వెళ్ళిపోతున్నాయి.

ఇంటర్వ్యూకి ఎలా వెళ్ళాలా అన్న విజయ్ ఆలోచనలు తెల్లారితూర్పున సూర్యుడుదయించేసరికి చీకట్లలాగే విడిపోయి అతని మనసును ప్రశాంతం చేశాయి —

కొడుకు ముఖంలోని భావాలను పూర్తిగా చదవలేకపోయినా, విజయ్ ఎందుకలా వున్నాడో కొంతలో కొంతన్నా వూహించకపోలేదు భూదేవి. డబ్బు దన్నం లేగ్గాని పట్టుపరుపు మీద కూచోబెడితే యువరాజులా వుంటాడను కుంటుందామె. ఇరవై యేళ్ళకే అరవై యేళ్ళవాడిలా వడిలిపోయిన కొడుకును చూసుకొని.

డబ్బుసమస్య తప్ప వేరే సమస్య తమ యింట్లో లేదని ఆమెకు తెల్సు. ఇలాంటి అవసరాలకు ఆదుకునే నాధుడు లేడనీ ఆమెకుతెల్సు — అందుకే

జాగా ఆలోచించిన మీదట చివరగా ఓ నిశ్చయానికొచ్చి నిట్టూర్పు విడిచింది

ఇంటర్వ్యూకి ఇక వెళ్ళేదిలేదనీ నిశ్చయించుకున్నాడు విజయ్— అతని మనసులో యిప్పుడు సంతోషంగాని బాధగానిలేవు— వెళ్ళినంత మాత్రాన వుద్యోగమొచ్చేస్తుందన్న హామీ ఎక్కడా అతనికిలేదు. అతని బంధువుల్లో ఎవరూ మంత్రిపదవుల్లోలేరు— అదృష్టమంటే పోస్టులో వచ్చే 'కాల్ లెటర్' కానక్కర లేదు. వచ్చే అదృష్టం జీవితంలో ఎలాగైనా వస్తుంది అనుకున్నాడు. పుల్ల ద్రాక్షవంక చూసి విసుక్కున్న నక్కలా—

అటువంటి సమయంలో తల్లి తనకు హామీయిస్తే ఆశ్చర్యపోయాడు విజయ్— తను సాధించలేనిది తల్లి సాధించిందన్న భావం మాట ఎలావున్నా యిచ్చేందుకామె దగ్గరేముందీ అని ఆశ్చర్యపోయాడు— చిరిగిన జాకెట్టును కుట్టుకుంటున్న అతని చెల్లెలుకూడ అమాయకంగా తల్లివంక చూసింది—

తల్లి యిచ్చిన చిన్న కాగితపు పొట్లం విప్పి చూసి ఆశ్చర్యపోయాడు విజయ్ మనసు పిండినట్లయింది— కళ్లంట నీటిచుక్కలు రావటమే తరువాయి— చిక్కి శల్యమైన తన ఆశలా గోడకానుకుని నిల్చున్న తల్లి కళ్ళలోకి చూశాడు. నేలకువారిన ఆమెకళ్ళలోని యే భావాన్నీ గ్రహించలేదు విజయ్— చేతిలోని వస్తువువంక చూడగానే తనేదో యీ కుటుంబానికి మోసం చేస్తున్నట్టు ఫీల యాడు— ఈ దరిద్రం వెనుక యిన్ని త్యాగాలు. యిన్ని ఆశలు. యిన్ని బంధాలు. ఎందుకో అతను వూహించలేకపోయాడు—

పదేళ్ళ క్రితం తండ్రి పోయినపుడు తల్లితీసి వేసిన మంగళసూత్రాలు— గత కాలపు వైభవాన్ని గుర్తుతెచ్చినా ప్రస్తుత దరిద్రానికి రంగుమాసి, భర్త పోయిన స్త్రీలా వున్నాయి— వాటిని అమ్మి వెళ్ళమని తల్లిపుద్దేశం—

తాళి కట్టినవాడు తననొదిలేసి తాడు తెంపేసినపుడు, పిల్లలమీద ఆధార పడ్డ బ్రతుకైనపుడు పనికిరాని ఆ తాళిబొట్టు పైకొచ్చి పనికొచ్చే పిల్లలకోసం అమ్ముకుంటేనేం? అనుకుంది భూదేవి—

రేపొద్దున్న కొడుకు వుద్యోగస్తుడైతే ఈ కష్టాలు గట్టెక్కి— ఒక్కగానొక్క ఆడపిల్లా అత్తారింటి మెట్టెక్కితే, ఈ బరువూ బాధ్యత కోడలిపిల్ల కప్పగించి కాశీకి హాయిగా రైలెక్కొచ్చు అనికూడ తలపోసింది,

విజయ్‌కి మాత్రం మనసొప్పలేదు— తనను పెంచి పెద్దజేసిన తలిదండ్రులకు పున్నామనరకానికి దారిచూపించేవాడుగా తయారయ్యాడనిపించింది.

పోనీ తల్లిసూచన ప్రకారం యింతా ఖర్చుపెట్టి ఇంటర్వ్యూకివెళితే తనొక వుద్యోగస్తుడవుతాడా అవడా అన్న ప్రశ్నకి సమాధానం దొరకటంలేదతనికి— తెలివైన వాళ్ళకే వుద్యోగాలిస్తారో, డబ్బూ పలుకుబడి వున్నవారికే వుద్యోగాలిస్తారో అతనికి పూర్తిగా తెలియదు— తెలివైన వాళ్ళకిచ్చేటయితే తనెంత తెలివైనవాడో మెరిట్ సర్టిఫికెట్లిచ్చిన కాలేజీకంటె తనకెక్కువ తెలీదు— తన తెలివితేటలు తనకంటె యితరులకు బాగా తెలియొచ్చు—

అంచేత, ప్రస్తుతం యిటు కుటుంబానికి ద్రోహం చేస్తున్నట్లు ఫీలయినా రేపొద్దున్న తను వెళ్ళకపోతే ,తెలివైన వాడొక్కడూలేడు వుద్యోగమిచ్చేందుకని' తనకు రావల్సినదాన్ని మరొకళకిచ్చేస్తారేమోనన్న భయంతో చివరికి వెళ్ళడానికి నిశ్చయించుకున్నాడు విజయ్—

*　　　*　　　*

ఇంటర్వ్యూ కమిటీలో విశ్వంకూడ వున్నాడు.

రేపు ఇంటర్వ్యూ అనగా ముందురోజు సాయంత్రం బంగారు రంగు కాశ్మీర్ శాలువా కప్పుకుని యింటిముందు లాన్‌లో కూర్చున్నాడు విశ్వం' అతనిదృష్టికి పకోడి పొట్లాల్లాంటి కూలీల పాకలుగాని ఎండిన తుమ్మమొద్దుగాని అస్తమిస్తున్న సూర్యుడుగాని, అగుపించటంలేదు— అతని దృష్టంతా కాంతి అందుకుని మరోగంలలో వెలగబోయే చంద్రుడి మీదేవుంది— అందుకే అతను యిచ్చిపుచ్చుకునేందుకెంతో విలువిస్తాడు— వుద్యోగాలిస్తాడు— పుచ్చుకోవాల్సినది పుచ్చుకుంటాడు— చెరుకుముక్కలో చేదైనా వుంటుందేమోగాని యిటువంటి

లావాదేవీల్లో నిశ్వంలో దగా మాత్రం వుండదు— అన్యాయంగా ఎవరిదగ్గరా డబ్బు పుచ్చుకోడతను— "ఉద్యోగాలివ్వని పక్షంలో డబ్బు వాపసు యీయ బడును" అనే బోర్డు కట్టకపోయినా ఆ నియమానికి మాత్రం కట్టుబడ్డాడు— ఆ నియమాల్ని మరికొందరికికూడ కట్టబెట్టాడు—

దూది పింజల్లాంటి ఆలోచనల్లో తేలిపోతూ ఆకాశాన్ని చూస్తున్న విశ్వా నికి దగ్గరగా, కుర్చీలాక్కుని కూర్చున్నాడు ఆనందరావు. ఆనందరావు విశ్వంకు ఒక్కగానొక్కకొడుకు— యూనివర్శిటీలో ఎమ్మే చదువుతున్నాడు కొడుక్కిరాబోయే ఆ ఎమ్మే డిగ్రీని పదిచేత గుణించి నోట్లకట్టలతో తూచి. దంత బొమ్మలాంటి అనురాధ తండ్రికి ముందుగానే చెప్పి ఒప్పించాడు విశ్వం. అంచేత 'నసేమిరా' అని ఆనందరావు మొరాయించినా పట్టుదలగా యూని వర్శిటీ మెట్లెక్కించాడు.

ఎప్పుడో డబ్బు అవసరమైతేగాని ఆనందరావు తండ్రి కెదురుపడ్డు—ఆ విషయం యిద్దరికి తెల్సు. అందుకే అటువంటి సమయంలో ఎంతవరకూ వచ్చింది రానీచదువు— అంటూ ముందరి కాళ్ళకు బ్రేక్‌వేస్తాడు! ఇప్పుడూ అదేచేశాడు—

కానీ యీసార్రి ఆనందరావు డబ్బు అడగలేదు ఓ విచిత్రమైన కోరిక తండ్రిని కోరాడు. నీతోపాటు యింటర్వ్యూకి నేనూవస్తానాన్నా అని—తను యింటర్వ్యూకి వెళ్ళేఅవసరం కలగదని అతడి వుద్దేశం అందుకే అదెలావుం టుందో చూద్దామనుకుని 'సదదా పడ్డాడా అబ్బాయి' చూద్దాంలే అనకుండా 'సరే' నన్నాడు విశ్వం.

*    *    *

పులిప్రక్కన చిరుతలా విశ్వం ప్రక్కన ఆనందరావు బయల్దేరాడు. పూలపడవలాంటి కారు మూడంతస్థుల ఫేక్టరీ బిల్డింగ్ ముందు మూడు వూగు లూగి ఆగేసర్కి ఆనందరావు కళ్ళు ఆఫీసుముందు తెల్లరంగువేసిన కాకుల

గుంపులా వున్న జనంపై పడ్డాయి. ఆ ఉన్నపోస్టు ఒక్కటే అని తెల్సుకున్నాడు కాబట్టి అతనొక్కసారి ఆశ్చర్యపోయాడు, డిగ్రీలతో పాటు వుద్యోగాల్ని కూడ ఆ యూనివర్శిటీ వాళ్ళే యిస్తే ఎంతబాగుణ్ణో అనికూడ అనుకున్నాడు. అతనిలో యిటువంటి ఆలోచనలెప్పుడూ కలగలేదు. ఈనాటి విద్యార్థే రేపటి నిరుద్యోగి అని కాలేజ్ మేగజీన్‌లో రాయాలనుకున్నాడు కూడ.

ఫుల్‌సూట్‌లో ఠీవిగా తండ్రితో వెళ్తూంటే కాకులమధ్య వెలిగే హంసలా గర్వంగా తోచిందతనికి ఎండతగలని ఏయిర్ కండిషండ్ గదిలోకి అడుగుపెట్టి జీడిపప్పు నోట్లో వేసుకుంటూ కొడుకుని యింటర్వ్యూ సభ్యులకు పరిచయంచేశాడు విశ్వం.

ఆనందరావుకి అదోలావుంది తండ్రిని చేస్నిబట్టి వాళ్ళు గౌరవిస్తున్నారో అర్థమైంది. అన్నిటికీ 'అర్థం' కదా ప్రధానం అనుకున్నాడు—

ఇంటర్వ్యూ మొదలయింది ఒక్కొక్కరుగా వస్తున్నారు అభ్యర్థులు ఏవేలో ప్రశ్నలు యేవేవో సమాధానాలు ఈ ప్రశ్నలూ సమాధానాలూ జీవితంలో ఎంతవరకూ పనికొస్తాయో ఆనందరావుకి అర్థంకాలేదు ఎమ్మే చదివిన తనకే చాల ప్రశ్నలకు సమాధానాలు తెలియవ్. గుమాస్తాగిరి చేసేవాడికెలా తెలుస్తాయో అనుకున్నాడు. తండ్రి చెవిలో అన్నాడుకూడ, చిన్మయానందంలా నవ్వి వూరుకున్నాడు విశ్వం —

కానీ అన్ని ప్రశ్నలకూ సమాధానం చెప్పిన వాడొక్కడే కన్పించాడు ఆనందరావుకి అతడు విజయ్! అందరి అభ్యర్థులకంటె అతనొక్కడే బాగా చెప్పాడనిపించింది తెలివికి వుద్యోగం యివ్వదలిస్తే విజయ్‌కి వుద్యోగం యిచ్చి తీరాలి అనుకున్నాడు. అదేమాట తిరిగి వస్తున్నపుడు తండ్రితో అన్నాడు. విజయ్‌ని చూడగానే ఆనందరావు కెందుకో జాలేసింది. వచ్చిన వాళ్ళలో అతనొక్కడే బీదవాడిలా కన్పించాడతని కళ్ళకి! 'ఎలాగైనా సరే ఆ వుద్యోగం విజయ్‌కే యిచ్చితీరాలి నాన్నా' అన్నాడు ఖచ్చితంగా తండ్రితో—

"చూద్దాంవోయ్ అందరూ ఒప్పుకోవాలిగా" అన్నాడు విశ్వం కొడుకును నిరాశపరచడం యిష్టం లేనట్టుగా— అప్పటికే అయిదువేలిచ్చిన అభ్యర్థి అతని కళ్ళల్లో మెదిలాడు— ఆర్కిమెడీస్ సూత్రం కాదుకదా ఆరార్గెంతో కూడ చెప్పగలిగే స్థితిలోలేడు పాపం ఆ లక్ష్మీ పుత్రుడు—

అయిదువేలు తీసుకున్నందుకు తెలివితేటలతో వుద్యోగాల్ని లింకు పెట్టకుండా. కమిటీ మెంబర్లను కూడ ఒప్పించి. ఆ లక్ష్మీ పుత్రుడికే వుద్యోగమిప్పించడమా?—లేక— ఆనందరావు కోర్కె ప్రకారం ఒక్క ఎర్ర ఏగానీ కూడ ఎర చూపకుండా తెలివితేటల్ని ప్రదర్శించి అడిగిన అడ్డమైన ప్రశ్నలకు చక్కగా సమాధానం చెప్పి 'అర్హుడు' అన్పించుకున్న విజయ్‌కి యివ్వడమా? అన్న ప్రశ్నకు వారంరోజుల్లో వియ్యంకుడిచ్చిన వుత్తరం పట్టుకుని, ఆనందరావుకి కాబోయే బావమరిది దిగడంతో సమాధానం దొరికింది!

[పోర్టు కల్చరల్ అసోసియేషన్ 1975 సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన పోటీలో రెండవ బహుమతి పొందిన కథ]

[ఆగష్టు 1975— సాగరిక]